నేడు బీవీఆర్ఐటీ 13వ వార్షిక వేడుకలు

నిజాంపేట్ : బీవీఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ 13వ వార్షిక వేడుకలు గురువారం సాయంత్రం 6 గంటలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్, బీవీఆర్ఐటీహెచ్సీఈడబ్ల్యూ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ సునీత బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ డైరెక్టర్ సొల్యూషన్ ఇంజినీరింగ్, సైనోప్సిస్ జయంతి కాసర్ల, ఇండియన్ రెవెన్యూ సర్వీస్, అసిస్టెంట్ కమిషనర్ పవిత్ర ముత్యప్, ఎస్వీఈఎస్ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఎస్వీఈఎస్ కార్యదర్శి ఆదిత్య కె విస్సంలు పాల్గొంటారని తెలిపారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష



అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

జీడిమెట్ల: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు చాకచక్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని జీడిమెట్ల ఫైర్ స్టేషన్ అధికారి శేఖర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం చింతల్‌లోని రిడ్జ్ టవర్ వద్ద అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదంలో చిక్కుకుంటే ఎలా వ్యవహరించాలో వివరించారు. ఇళ్లల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది, అపార్ట్‌మెంట్ ప్రజలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు ఆఫర్

నిజాంపేట్ : సక్రమంగా పన్నులు చెల్లించే వారిని ప్రోత్సహించడంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఆస్తి పన్ను చెల్లింపులో ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్లు బుధవారం కమిషనర్ సాబేర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 30వ తేదీ లోగా పన్ను చెల్లించినవారికి 5శాతం రిబేటుతో పన్ను చెల్లించే అవకాశమిస్తున్నట్లు తెలిపారు.

మెకానిక్ షెడ్డులో అగ్ని ప్రమాదం



నిజాంపేట్ : బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీ సమీపంలో బాచుపల్లి మియాపూర్ రోడ్డు ప్రధాన రోడ్డుపై ఓ మెకానిక్ షెడ్డులో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బాచుపల్లి పోలీసులు ఫైర్ ఇంజన్‌ను పిలిపించి మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి హాని జరగలేదని, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

తైబజార్ వేలం



వేలంలో సొంతం చేసుకున్న సత్యవతి

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం తైబజార్ వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జరిగిన వేలం పాటలో అమీగో ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎస్.సత్యవతి, ఎల్.అరుణ్ కుమార్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. గోపాల్‌రెడ్డి రూ.22 లక్షలు, సత్యవతి రూ.23 లక్షలకు వేలం పాట పాడారు. దీంతో ఎల్-1గా నిలిచిన సత్యవతికి తైబజార్‌ను కేటాయిస్తూ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ ఫైనల్ చేసి దానికి సంబంధించిన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ప్రభాకర్, మేనేజర్ లక్ష్మయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ నవనీత తదితరులు

రంగారెడ్డినగర్: టీబీని నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సూచనలతో సకాలంలో మందులు వేసుకుంటే పూర్తిగా నయమవుతుందని షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ నవనీత అన్నారు. బుధవారం ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీలో టీబీ వ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు సరిపడా మందులు, న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా టీబీ నుంచి త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సిరాజుద్దీన్, క్షయ విభాగం ఉద్యోగులు కిషోర్, మహేష్, ప్లాన్ ఇండియా సంస్థ ప్రతినిధి రాధాకృష్ణ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు మరింత దన్ను!

సెర్ప్‌లో మెప్మా విలీనం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇక రుణాల పంపిణీ, రికవరీ, పథకాల నిర్వహణ మరింత సులభం
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 10,575 సంఘాలు.. 1.10 లక్షల మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే సెర్ప్, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే మెప్మాను ఒకే గొడుగు కిందికి తీసుకురానున్నది. దీనివల్ల రుణాల పంపిణీ, రికవరీ, పథకాల అమలు, నిర్వహణ మరింత సులభమవుతుందని భావిస్తోంది. ఈమేరకు సెర్ప్‌లో మెప్మాను విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రయోజనాలు ఇలా..

విలీనంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 1,10,007 సభ్యులు ఉండనున్నారు. రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతారు. తాజాగా ఇందిరా మహిళా శక్తి మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండింటిని విలీనం చేసి ఆర్థిక స్వాతంత్ర్యం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నది. ఇంతకుముందులా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరుగా పథకాలు అందించడంలో ఏర్పడే సమస్యలు సైతం తొలగనున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయ ఆధారిత పథకాలు, పట్టణాల వారికి వ్యాపార ఆధారిత పథకాలు అందించేవారు. ఇప్పుడు విలీనంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలకు సమానంగా అందించే అవకాశం కలుగుతుంది. పక్కాగా పథకాల అమలు, మెరుగైన నిర్వహణ, పర్యవేక్షణ దృష్ట్యా సెర్ప్‌లో మెప్మాను ప్రభుత్వం విలీనం చేస్తోందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో మార్గదర్శకాల (గైడ్ లైన్స్) కోసం సెర్ప్, మెప్మా అధికారులు, ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

10,575 సంఘాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల ఉండగా, 1,10,007 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్‌లో 3,404 సంఘాలు ఉండగా 37,557 మంది , అలాగే మెప్మాలో 7,245 మహిళా సంఘాలు ఉండగా, 72,450 మంది సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి

– కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని



ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంధ్య

కుత్బుల్లాపూర్: అంకుటిత దీక్ష, పట్టుదలతో పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ పూర్తి చేసి సత్తా చాటింది. సదరు విద్యార్థినికి ఎమ్మెల్యే వివేకానంద్ ఆర్థికంగా చేయూతనందించి ఎంబీబీఎస్ పూర్తి చేయడంలో సహకరించారు. సూరారం 60 గజాలు తెలుగుతల్లినగర్‌కు చెందిన దినసరి కూలీ ముదిగొండ లక్ష్మయ్య, లక్ష్మమ్మలకు నలుగురు సంతానం. వీరిలో మొదటి ముగ్గురు ఆడపిల్లలు (ఝాన్సీ, సంధ్య, కళ్యాణి), ఒక అబ్బాయి (ఆదిత్య). సంధ్య ఎంబీబీఎస్ చేయాలనే సంకల్పంతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని 2019లో జరిగిన నీట్ పరీక్షలో 4,545వ ర్యాంక్ సాధించి ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఫీజుతో పాటు పుస్తకాలను అందజేసి ఎమ్మెల్యే ప్రోత్సహించారు. దీంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టా సాధించిన సంధ్య బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

నేడు గండిమైసమ్మలో బీఆర్ఎస్ సమావేశం

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని గురువారం గండిమైసమ్మలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశానికి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం



శివ (ఫైల్)

కుత్బుల్లాపూర్: చెరువులో మునిగి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. పేట్ బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీన దూలపల్లిలోని లింగయ్య చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీంతో అతని ఆచూకీ కోసం పోలీసులు పలు చోట్ల పోస్టర్లు అంటించగా ఆచూకీ లభించింది. మృతుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాజన్ కుమారుడు శివగా గుర్తించారు. మృతుడు రెండు నెలలుగా దూలపల్లిలోని సంజనా అపార్ట్‌మెంట్స్‌లో లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న పని ముగించుకుని రాత్రి 8.30 గంటల సమయంలో లింగయ్య చెరువు సమీపంలోని మద్యం దుకాణంలో మద్యం సేవించాడు. మద్యం మత్తులో సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయరూ!



జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్ రోడ్డు నంబర్1లో మ్యాన్‌హోల్‌పై ఉన్న మూత పూర్తిగా విరిగిపోయింది. దీంతో స్థానికులు ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో ఎవరూ పడిపోకుండా కర్రను ఉంచారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పట్టించుకుని మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మేడ్చల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవిర్భావం

సాక్షి,సిటీబ్యూరో: ఉద్యోగులపై ఒత్తిళ్లు, వాగ్దానాల అమల్లో జాప్యం, ఆర్థిక సమస్యల నేపథ్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు సంయుక్తంగా జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ (టీఎన్‌జీవోస్)పేర్కొంది. ఈ మేరకు మేడ్చల్ కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జిల్లా చైర్మన్ బి.రవి ప్రకాశ్,సెక్రటరీ జనరల్ జి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కమిటీ ఉద్యమిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ఇప్పటివరకు స్పందించలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డుల అమలు లేకపోవడం, జీపీఎఫ్‌లు సమయానికి జమ చేయకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా కార్యరూపం దాల్చలేదన్నా రు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. జేఏసీ కమిటీలో వివిధ అధికార, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వై.రమేశ్వర్ గౌడ్, బి.భరత్ కుమార్, ఎ.కురుమూర్తి, బి.వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, పి.సుధాకర్, పి.రాఘవేందర్, శ్రీనివాస్, మోహన్ రావు, హెచ్.కె.సంతోషి, కె.ఆర్.రవి కుమార్, సృజన, జగదీశ్వర్, రాజ్‌కుమార్, సామ్యుయెల్ పాల్, విజయలక్ష్మి, ఆనంద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, డి.రవీందర్, ఈ.ఎస్.ఎస్.గిరి కాంత్, బ్రహ్మాచారి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, వినోద్ కుమార్, నజీమా, సునీత కె.భాస్కర్ గౌడ్, కార్తీక్, యాదగిరి, మాణిక్యం, వేణుగోపాల్, శ్రీధర్, రవియాదవ్‌కు స్థానం కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం

చింతల్: వేసవిలో చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చడానికి దోహద పడతాయని బీజేపీ చింతల్ డివిజన్ నాయకుడు రాజా సదానంద అన్నారు. చంద్రానగర్‌లో మోహర్ ఉన్నీసా బేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో చంద్రానగర్ వెల్ఫేర్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దేగల కృష్ణమూర్తి సత్యనారాయణ, శంకర్‌గౌడ్, నరసింహులు, భాస్కర్‌రెడ్డి, గణేష్, రామ్, సాయి యాదవ్ పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం ఎదురు చూపులు

రెండు నెలలుగా విన్నవిస్తున్నా పట్టించుకోని అధికారులు



చింతల్: గుక్కెడు తాగు నీటి కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న వారికి తాగునీటి కష్టాలు తీరడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన ఆ రెండు గల్లీలకు మాత్రం నీరందే పరిస్థితి లేదు. ఉషోదయ సెక్షన్ పరిధిలోకి వచ్చే పీపీ నగర్‌లో కొంత కాలంగా నీటి ఎద్దడి నెలకొంటుంది. సుమారు రెండు గల్లీలలో పూర్తిస్థాయిలో ఒక చెంబు నీరు కూడా రావడం లేదంటే అధికారుల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. ప్రకాశం పంతులు నగర్, భవాని నగర్లలో రెండు గల్లీలకు రెండు నెలలుగా ఒక్క చుక్క నీరు రావడంలేదని వారు ఆరోపిస్తున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు, లైన్మెన్ మాత్రం ముందుగా ప్రకాశం పంతులు నగర్, భవానీ నగర్‌లో ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందని.. మరోసారి అడిగితే వాల్వు చెడిపోయిందని సదరు లైన్మెన్ పేర్కొనడం గమనార్హం.

తాగడానికి నీళ్లు ఇవ్వండి

నీరు రావడంలేదని ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన పలువురు మహిళలు బస్తీ వాసులు బుధవారం ఉషోదయ సెక్షన్ కార్యాలయానికి వచ్చి సెక్షన్ మేనేజర్ ఝాన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా చుక్క నీరు రావడం లేదని ఫిర్యాదు చేసినా తమను పట్టించుకోరా అంటూ పలువురు మహిళలు మేనేజర్‌ను చుట్టుముట్టారు. దీంతో సదరు మేనేజర్ స్థానికంగా పర్యటించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ప్రకాశం పంతులు నగర్ వాసులు వెనుదిరిగారు.

రెండు నెలలుగా రావడం లేదు



ప్రకాశం పంతులు నగర్‌లోని రెండు గల్లీలలో ఒక చుక్క కూడా నీరు రావడం లేదు. ఇదే విషయమై లైన్‌మెన్ గంగాధర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. ఆయన పనితీరుపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్‌లలోని కొన్ని కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తున్న అధికారులు, పేద ప్రజలు ఉండే బస్తీలకు వారానికి ఒక్కరోజు కూడా నీటి సరఫరాను చేయడం లేదు. – అబ్దుల్ మహ్మద్, ప్రకాశం పంతులు నగర్

ప్రభుత్వ భూములను పరిశీలించిన హైడ్రా



భూములను పరిశీలిస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 25/1లో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. ఇటీవల ఇక్కడ చోటు చేసుకుంటున్న నిర్మాణాలతో పాటు ప్రభుత్వ స్థలం ఎంత ఖాళీగా ఉంది అన్న విషయంపై ఆరా తీశారు. యాదిరెడ్డిబండ, వినాయక నర్సరీ, జర్నలిస్టులకు కేటాయించిన భూమి, అక్కడ ఇరువైపులా చేపట్టిన నిర్మాణాల వివరాలను తెలుసుకున్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్ ఆవరణలోకి వెళ్లి అటు వైపుగా ఉన్న ఖాళీ స్థలం ఎంతవరకు ఉందన్న విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. హెచ్ఎండీఏకు చెందిన భూమి 25/1 సర్వే నంబర్లు ఎంత వరకు ఉంది, వాటిలో వెలసిన నిర్మాణాలు ఏమిటి? అనే అంశాలను మాత్రమే పరిశీలించినట్లుగా తెలుస్తుంది. అయితే హైడ్రా అధికారుల పర్యటన వచ్చామా.. చూశామా.. వెళ్లామా..! అన్న విధంగా వేగంగా కొనసాగింది. నర్సరీ పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టగా గతంలో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తిరిగి అదే ప్రాంతంలో నిర్మాణాలు చేయడం విశేషం. అదే విధంగా మాజీ నక్సలైట్ అంటూ ఓ వ్యక్తి ఏకంగా ఐదు ఎకరాల స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేయడంపై ఆరా తీశారు. ఇదే క్రమంలో అక్కడక్కడ జరిగిన నిర్మాణాలను పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ జరిగిన అక్రమ నిర్మాణాల విషయంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అన్న విషయంపై స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలు లబ్ధి



దయానంద్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో దేశంలోని కోట్లాది మంది పేద ప్రజలు లబ్ధిపొందుతున్నారని బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గావ్ చలో – బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు సాయిబాబా నగర్ బొడ్రాయి, సంతోష్ నగర్, దయానంద నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాండు బస్తీ కాలనీ వ్యవస్థాపకులు పాండు, బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ గిరిబాబు, సీనియర్ నాయకులు విఘ్నేష్ ముదిరాజ్, చిన్నస్వామి, మోహన్, చందు, రాహుల్, రాజేష్, వినయ్, మహిళా నాయకురాలు శారదా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్ వేయాలని వినతి



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ మూర్తిగనర్‌లోని 15వ బ్లాక్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బుధవారం జల మండలి అధికారి అశోక్‌కుమార్‌కు బస్తీ వాసులు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా సరైన డ్రైనేజీ లైన్ లేకపోవడంతో తరచూ మురుగు రోడ్డుపైకి వస్తోందని, త్వరితగతిన పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బస్తీ వాసులు శివకుమార్, కాంగ్రెస్ నాయకుడు తైలం శ్రీనివాస్, కారం ప్రకాష్, నవీన్, శ్యాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.